క్లుప్తంగా

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మాట్లాడుతున్న వీరారెడ్డి

సంగారెడ్డి టౌన్: భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డివర్మ 135వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ భాగ్యరెడ్డివర్మ కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, వారి ప్రభావం ఒక్క తెలంగాణ రాష్ట్రం మీదే కాకుండా భారతదేశం మొత్తానికి ఉందన్నారు. అంతేకాకుండా వివిధ సంఘాలు ఏర్పాటు చేసి కళాజాతల ద్వారా విద్య ప్రాముఖ్యతను తెలియజేశారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి జగదీష్, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ మంజుల

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మంజుల సోమవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో రికార్డుల ట్యాంపరింగ్ చేస్తూ ఆన్‌లైన్‌లో ఇంటి నంబర్లు ఇచ్చి రిజిస్ట్రేషన్‌కు డబ్బులు తీసుకొని అనుమతి ఇస్తున్నారని తెలిపారు. గతంలో పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశామని.. అయినా ఎలాంటి మార్పు రాలేదని చెప్పారు. ఇప్పటికైనా అక్రమాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): భవన నిర్మాణ రంగంలో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలలోద్దిన్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునిత ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రవెన్యూ ఇన్‌స్పెక్టర్ గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సయ్యద్ జలలోద్దిన్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు తాజోద్దీన్, పట్టణ మండల నాయకులు రుభీనాబేగం, అంజయ్య, సక్కుబాయి, కిష్టయ్య, చంద్రకళ, పద్మ, వినోద, లక్ష్మి పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లపై ఆంక్షలు సరికాదు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఎకరాకు 5.16 క్వింటాళ్ల జొన్నలు మాత్రమే ప్రభుత్వ మద్దతు ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం ఆదేశించడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చాట్ల సిద్దన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరాకు 15క్వింటాళ్లకు పైగా జొన్న పంట దిగుబడి వస్తుందని, అలాంటిది కేవలం ఎకరాకు 5.16క్వింటాళ్లు కొనుగోలు చేస్తే మిగిలింది. ఎక్కడ అమ్మాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం జొన్న కొనుగోళ్లపై ఆంక్షలు విధించడంతో రైతులు ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జొన్నల కొనుగోళ్లపై విధించిన ఆంక్షలు తొలగించి ఎకరాకు 15 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, నాయకులు

మునిపల్లి(అందోల్): రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని కంకోల్ అభిషేక్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ హాజరయ్యారు. అంతకుముందు కంకోల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్, సంగమేశ్వర పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయన్నారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ శైలజాశివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షిసాయికుమార్, వైస్ ఎంపీపీ బాబాపటేల్, సీనియర్ నాయకులు అల్లం నవాజ్ రెడ్డి, సర్పంచ్ విశ్వనాథం, జైపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మఠం భిక్షపతి, పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల అందజేత

జోగిపేట(అందోల్): మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోమవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు నాగిరెడ్డి, దుర్గయ్య, నాయకులు మాణిక్‌రెడ్డి, వీరేశం, పద్మనాభరెడ్డి, వెంకట్‌రెడ్డి, చాపల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జోగిపేట(అందోల్): ఆందోల్ గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో ప్రధాన పూజారి శ్యామ్‌నాథ్ పంతులు సతీమణి చిదిరే భవాని సోమవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ గ్రామానికి వెళ్లి మృతురాలికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర మార్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ గంగా జోగినాథ్, మాజీ ఎంపీపీ రామగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, అనిల్ కుమార్, షకీల్, సుధాకర్ ఉన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): హార్టెక్స్ పరిశ్రమ కార్మికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమ యాజమాన్యం ఇటీవల అప్రకటిత లాకౌట్ విధించింది. దీంతో పరిశ్రమ తీరును నిరసిస్తూ కార్మికులు పరిశ్రమ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. కార్మికులకు మద్దతుగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నిరసన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రాథమిక హక్కులను సైతం పరిశ్రమ యాజమాన్యం కాలరాస్తోందని మండిపడ్డారు. యాజమాన్య వ్యతిరేక వైఖరిని ప్రశ్నించినందుకు 12 మంది కార్మికులకు సస్పెండ్ చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం మొండి వైఖరిని వీడనాడి కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో కఠిన నిర్ణయాలు తీసుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రారెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకుడు, పరిశ్రమ కార్మిక సంఘం అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఈన్నారు. మండలంలోని ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.కోటి 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమణి శ్రీశైలం, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, ఎంపీటీసీ శ్రీశైలం, ఉపసర్పంచ్ శోభ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, బండరాజు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి ఎమ్మెల్యే పూజలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంలో సోమవారం నిర్వహించిన పోచమ్మ జాతరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణ, పరమేష్, అంజిగౌడ్, కుమార్, గణేష్, భీంరావ్, శ్రీను పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ జెండా ఎగురేస్తాం

పటాన్‌చెరు: మండల పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడ కిర్బి పరిశ్రమలో త్వరలో నిర్వహించనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌టీయూ జెండా ఎగరేస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కిర్బి పరిశ్రమ బీఆర్‌టీయూ, బీఎంఎస్, టీఎన్‌టీయూసీ కార్మిక సంఘాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ కార్మిక శాఖ మంత్రి పెద్దిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిర్బి పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్, టీఎన్‌టీయూసీ, బీఎంఎస్‌లు కూటమిగా ఏర్పడి పోటీ చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, కార్మిక నాయకులు మాధవరావు (బీఆర్‌టీయూ), శ్రీనివాస్ (బీఎంఎస్), సుదర్శన్ (టీఎన్‌టీయూసీ) కార్మికులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి రామచంద్రారెడ్డినగర్ కాలనీలో భవసార్ క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన తుల్జాభవానిమాత పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పనగేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రావూస్, చైతన్య పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని నిరసిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను పాఠశాలల యాజమాన్యాలు సొమ్ముచేసుకుంటూ ఇష్టానుసారంగా అందినకాడికి దోచుకుంటున్నారన్నారు. కొన్ని పాఠశాలలకు అనుమతులు లేకున్నా 10వ తరగతి వరకు కొనసాగిస్తున్నారని, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ఇదేవిధంగా నడపడం ద్వారా 8 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయలేకపోయారని గుర్తు చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యా సంవత్సరం ప్రారంభానికే ముందే అనుమతులు లేని పాఠశాలలను గుర్తించడంతో పాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దర్గ ప్రసాద్, హరీశ్, ధన్‌రాజ్, రాహుల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌పై వర్క్‌షాప్



సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి మున్సిపాలిటీలో సోమవారం ఆర్ఆర్ఆర్‌పై మహిళా సంఘాలతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నిరుపయోగంగా ఉండే వస్తువులు పడేయకుండా (రెడ్యూస్, రీ యూజ్, రీసైకిల్) ఇతరులకు ఉపయోగపడేవిధంగా ఆర్ఆర్ఆర్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉండే వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటర్స్‌కు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్ విజయబాబు, మల్లేశ్వరి, వెంకట్‌నాయక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వీరేశం పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు 17మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో డాక్టర్ అడవిరాజు

జోగిపేట(అందోల్): స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ అనే సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అడవిరాజు అధ్యక్షతన జాబ్ మేళాలను నిర్వహించారు. మేళాకు విశేషమైన స్పందన వచ్చింది. ఈ జాబ్ మేళాకు పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి 50 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో మ్యాజిక్ బస్ కోఆర్డినేటర్ హసీం విద్యార్థులకు ముఖాముఖిని నిర్వహించారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్ట్స్ సంస్థకి 11 మంది విద్యార్థులు, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థకు నలుగురు విద్యార్థులు, అరబిందో సంస్థకి ఇద్దరు ముఖాముఖిలో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అడవిరాజు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, టీఎస్ కేసీ కోఆర్డినేటర్ అనసూయ పాల్గొన్నారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

సంగారెడ్డి టౌన్: తప్పులు లేని ఓటరు జాబితా నవీకరణకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులపై విచారణ జరుపుతున్నారన్నారు. జనవరి 5, 2022 నుంచి జనవరి5, 2023 వరకు జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో ఓటర్లు జాబితాలో 41,806 ఓటర్లు కొత్తగా చేరగా 47,912 మంది ఓటర్లను తొలగించారని తెలిపారు. తొలగించిన ఓటర్లను భౌతికంగా పున పరిశీలన చేయగా 47,493 తొలగింపులు సరైనవని, 419 మంది ఓటర్లను తప్పుగా తొలగించినట్లు ధృవీకరించుకుని సంబంధిత 419 మంది నుంచి ఫారం 6ను తీసుకుని ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. అన్ని పీఎస్ఈ క్లస్టర్లలో రికార్డుల నుంచి 881 ఓటర్లను తొలగించగా అందులో చనిపోయిన వారు131 మంది కాగా 428 షిఫ్ట్ అయిన వారని, 268 మంది ఓటర్లను తప్పుగా తొలగించినట్లు గుర్తించి వారి నుంచి 268 మంది నుండి ఫారం 6 తీసుకుని ఓటరు జాబితాలో నమోదు చేశామని తెలిపారు. షిఫ్టెడ్ క్యాటగిరిలోని 2982 ఓటర్లను భౌతికంగా పరిశీలించగా అందులో 64 మంది ఓటర్లను పారపాటుగా తొలగించినట్లు గుర్తించి వారి నుంచి ఫారం 6 తీసుకున్నట్లు వివరించారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి పెద్దపీట



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: బీసీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మత్స్యశాఖ భవన్‌లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాష్‌తో కలసి రాష్ట్ర మత్స్యశాఖ సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా పిట్టల రవీందర్ ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు పాల్గొని పిట్టల రవీందర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. సంగారెడ్డి జిల్లా ముదిరాజ్, మహాసభ అధ్యక్షులు పులిమామిడి రాజు, కొట్టాల యాదగిరి, పాండు, శ్రీనివాస్, వరలక్ష్మి, జగన్, సాయిబాబు, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం



కరపత్రాన్ని విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

అదనపు కలెక్టర్ వీరారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ జీవితానికి సంబంధించిన సంఘం శరణం గచ్ఛామి అనే అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంపై నాటక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత.. ప్రపంచ మేధావి అంబేడ్కర్ ఆయన జీవితంలో కుల వివక్ష, అంటరానితనం ఎదుర్కొని పీడిత వర్గాలను చైతన్యవంతం చేస్తూ అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు జయరాజు, అశోక్, నాగన్న, అడ్వకేట్ రామారావు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, మల్లన్న, లక్ష్మి, మన్నే గోపాల్, దుర్గేష్, భూషణం, ఆశన్నగౌడ్, కృష్ణ, పవన్, శివ, దాసు, భానుతేజ, రాజయ్య పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీకి డీడీల చెల్లింపు

రాయికోడ్(అందోల్): రెండవ విడత గొర్రెల పంపిణీకి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 400 మంది అర్హులైన లబ్దిదారులు డీడీలు చెల్లించినట్లు మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో గొర్రెల యూనిట్ల పంపిణీ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జీవాలు, పశువులకు జబ్బవాపు, గొంతువాపు, చిటక రోగాల నివారణకు వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వార్డు కార్యాలయం మంజూరు**

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌కు రూ.కోటి 50లక్షల అంచనా వ్యయంతో నూతన వార్డు కార్యాలయం మంజూరైన సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ శంకరయ్య, అధికారులకు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యాలయం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో మంజూరుకావడం హర్షనీయన్నారు.

◆ **విత్తనాల పంపిణీ ప్రారంభం**



న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో సోమవారం విత్తనాలను పంపిణీని వ్యవసాయశాఖ మండల అధికారి లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాల్‌కల్‌కు వచ్చిన 400 బస్తాల జనుము విత్తనాలను స్థానిక ఎరువుల విక్రయ కేంద్రంలో ఏఓ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్, ఏఈఓలు షరీఫ్, హీనా, మమత పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న ఉత్సవాలు**

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండల కేంద్రంలో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం ధ్వజస్తంభం నెలకొల్పిన అనంతరం బీరప్ప విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా బీరప్ప- కామరతిలకు కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, పుల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ అనంతరావు కులకర్ణి, ఎంపీటీసీ శ్రీనివాస్‌చారి, సర్పంచ్ శ్రావణ్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ మహేష్‌బాబు పాల్గొన్నారు.

◆ **వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంఘా సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పట్నం విజయలక్ష్మి సుభాష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజన్న, ఆలయ కమిటీ సభ్యులు మల్లేశం పాల్గొన్నారు.

◆ **ఆర్థికసాయం అందజేత**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామానికి చెందిన నాగేందర్ కుమార్తె పూజ వివాహం కర్నాటకలోని ఇటాగ గ్రామంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వివాహనికి హాజరైన సర్పంచ్ వధువుకు సర్పంచ్ కుత్బోద్దీన్ రూ.5వేలు అందజేశారు. సర్పంచ్ సాయంతో పలువురు అభినందిస్తున్నారు.

◆ **నేటి నుంచి అభయ ఆంజనేయస్వామి ఉత్సవాలు**

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని మిన్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలను ఈ నెల 23నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ **ముమ్మరంగా పారిశుధ్య పనులు**



నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా కాలనీలలో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ ఫౌడర్‌ను చల్లారు. పారిశుధ్య పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

◆ **ఖేడ్‌లో భారీ వర్షం**

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున గంటన్నర పాటు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో ఉదయం 7 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. ఖేడ్‌లో 38.2 మిల్లీమీటర్లు, నాగల్‌గిద్దలో 27.6, మనూరులో 21.4, సిర్గాపూర్‌లో 16.4, కల్హేర్‌లో 11.6, కంగ్టిలో 8.2 మిల్లీమీటర్లుగా నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

◆ **రామలింగేశ్వర ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామంలోని అతిపురాతనమైన రామలింగేశ్వర ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమ శివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ **మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భారతినగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. సోమవారం బెల్ టౌన్‌షిప్‌లోని సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అధునాతన టైలరింగ్, జ్యూట్‌బ్యాగ్ తయారీ, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బెల్ ఏజీఎం సుజన తదితరులు పాల్గొన్నారు.

◆ **సీఐటీయూ, ఎమ్మార్పీఎస్ నాయకులపై కేసు**

సంగారెడ్డి టౌన్: పోలీస్ యాక్ట్ అమల్లో ఉండగా సోమవారం సీఐటీయూ, ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై అడ్డు తలగడంతో పాటు విధినిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించారని, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉన్నందునా ధర్నాలకు అనుమతి ఇవ్వకున్నా ధర్నాలు చేయడంతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షులు మల్లయ్య మరి కొంతమంది సీఐటీయూ నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు బూడిద కుమార్, మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు.

◆ **'కంటివెలుగు' శిబిరం ప్రారంభం**



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్‌లో సోమవారం కంటి వెలుగు శిభిరాన్ని గ్రామ సర్పంచ్ కుత్బోద్దీన్ ప్రారంభించారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిభిరానికి వచ్చిన రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న దేవతామూర్తుల పున:ప్రతిష్ఠాపన ఉత్సవాలు**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గుంజోటి గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల పున:ప్రతిష్ఠాన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం యంత్ర ప్రతిష్ఠాపన, ఆంజనేయ స్వామి, ఉరడమ్మ, పోచమ్మ, లింగమయ్యతో పాటు మరో 15 మంది దేవతామూర్తుల విగ్రహాల పున:ప్రతిష్ఠానలు నిర్వహించారు. కార్యక్రమానికి ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ హాజరయ్యారు.

◆ **వేడి నుంచి ఉపశమనం**



సంగారెడ్డి అర్బన్: ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా పట్టణం చల్లబడింది. వేడి నుంచి ఉపశమనం పొందటానికి జనాలు గొడుగులు టోపీలు ఎటువంటివి లేకుండానే రోడ్లపై తిరుగుతున్నారు.

◆ **వైభవంగా మల్లన్నస్వామి జాతర**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అందూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన మల్లన్నస్వామి జాతరకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, వైస్‌ఎంపీపీ గంగు రమేష్, ఎంపీటీసీ జనాబాయి, వైస్ ప్రెసిడెంట్ రాజాగౌడ్, సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి**

నారాయణఖేడ్: ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఇప్పటికే పలుమార్లు కురిసిన అకాల వర్షాలకు నష్టం జరగడంతో పాటు కొనుగోళ్లలో ఆలస్యం చేయడం, తరుగు పేరిట కోతల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో నిర్వాహకులు త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.